## అంత్యోదయ కార్డులకు
# చక్కెర ఎందుకు ఇస్తలేరు

- డీలర్‌ను ప్రశ్నించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు
- కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ, రేషన్ షాపు, హైస్కూల్‌లలో విస్తృత తనిఖీలు
- రెవెన్యూ, పౌర సరఫరా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో పేదలకు చక్కెర, గోధుమలు అందడంలేదని వెల్లడి

కొత్తూరు, జూన్ 28 : రేషన్ షాపుల్లో అంత్యోదయ కార్డులకు చక్కెర ఎందుకు ఇవ్వడంలేదని డీలర్లను రాష్ట్ర ఫుడ్ కమిషన్ ప్రశ్నించింది. శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీలు, రేషన్ షాపు, హైస్కూల్, పీహెచ్‌సీల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫుడ్ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీవాడలోని అంగన్‌వాడీ కేంద్రాని కెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులకు ఏమేమి ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న చిన్నారులను తూకం మిషిన్‌పై కూర్చోబెట్టి బరువును నమోదు చేశారు. ఆ తర్వాత రికార్డుల్లో ఎంట్రీ చేసిన బరువు, ప్రస్తుతం ఉన్న బరువు పరిశీలించారు. అయితే కొంతమంది చిన్నారుల బరువు ఎక్కువగా, మరి కొంతమంది చిన్నారుల బరువు తక్కువగా ఉండడాన్ని గమనించి అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకాలు, ఇస్తున్న ఆహార నమోదును పరిశీలించారు. అనంతరం వంట రూమ్‌కు వెళ్లి ఆహారాన్ని రుచి చూశారు.

### డీడీలు కడితే ఇస్తాం..

మున్సిపాలిటీ పరిధిలోని 15వ రేషన్ షాపునకు వెళ్లిన ఫుడ్ కమిషన్ సభ్యులు అక్కడ రేషన్ ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. 35 అంత్యోదయ కార్డులకు బియ్యంతోపాటు చక్కెర ఇస్తున్నారా..? అని డీలర్‌ను ప్రశ్నించగా.. నాలుగైదు ఏండ్లుగా చక్కెర రావడంలేదని అతడు చెప్పాడు. దీంతో అక్కడే ఉన్న పౌరసరఫరాశాఖ అధికారులను ప్రశ్నించారు. డీలర్ డీడీ కట్టడంలేదని కడితే ఇస్తామన్నారు. రేషన్ షాపులను ఎందుకు తనిఖీ చేయడంలేదని పౌరసరఫరా శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌ను ఫుడ్ కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. అనంతరం ఈ విషయంపై కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని ప్రశ్నించగా నాలుగైదు ఏండ్లుగా చక్కెర రావడంలేదని ఆయన చెప్పారు. పౌరసరఫరా, రెవెన్యూశాఖ అధికారుల సమన్వయం లోపంతోనే పేదలకు షుగర్, గోధుమలు అందడంలేదని.. ఇలాంటివి మరోసారి పునరావృతం కావొద్దని వారు హెచ్చరించారు. అలాగే లబ్ధిదారుల ఫిర్యాదులకోసం షాపు ఎదుట ఫిర్యాదు పెట్టెను ఉంచాలన్నారు.

### మధ్యాహ్న భోజనం భేష్..

అనంతరం ఫుడ్ కమిషన్ సభ్యులు కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి బాగుందని మెచ్చుకున్నారు. ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కొత్తూరు మండలంలోని చిన్నారుల్లో రక్తహీనత 20 నుంచి 25 శాతం వరకు ఉన్నదని.. దానిని తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంలో పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు అనేక రకాల పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. అవి సక్రమంగా అమలు జరిగేలా చూడడమే ఫుడ్ కమిషన్ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, శారద, భారతి, జ్యోతి, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు రాథోడ్, వెంకటేశ్వరరావు, నవీన్ రెడ్డి, రామారావు, ఖలీల్, శ్రీలత, పద్మజారమణి, రామేశ్వరి, విమల, విద్యావైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, జడ్పీటీసీ శ్రీలత, ఆర్డీవో వెంకటమాధవరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, డీఈవో సుశీందర్‌రావు, ఎంపీడీవో అరుంధతి, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థికి వడ్డిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు

## అభివృద్ధి పనులను
# ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జూన్ 28 : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 'కడా' కింద ఇదివరకే మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కడా కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి వికారాబాద్, నారాయణపేట జి ల్లాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అభివృద్ధి పనులను ప్రాధాన్యాతాక్రమంలో చేపట్టాలన్నారు. మంజూరైన అభివృద్ధి పనులకు త్వరగా టెండర్లు పిలిచి పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణ, బలోపేతానికి పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణానికి భూసేకరణ చేపట్టాలని..ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే మంజూరైన చెక్‌డ్యాంల నిర్మాణ పనులు, అటవీశాఖ భూముల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై గుంతల్లేకుండా ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని, ప్రతి వారం నిర్వహించే సమీక్షలో పనుల్లో పురోగతి ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రభుత్వ దవాఖానను సందర్శించి బిల్డింగ్‌ను పరిశీలించడంతోపాటు దవాఖానలో అందుతున్న చికిత్సలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దవాఖాన భవన నిర్మాణ నమూనాలు, వైద్యుల నియామకం, నీటిట్యాంకు, పైప్‌లైన్ పనుల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, తహసీల్దార్ విజయ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తాండూరు ప్రభుత్వ జిల్లా దవాఖాన తనిఖీ

తాండూరు : ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం ఆయన తాండూరు ప్రభుత్వ జిల్లా దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు ఎంత మంది ఉన్నారు..? సమయానికి వస్తున్నారా..? లేదా..? రోగులకు మెరుగైన సదుపాయాలు అందుతున్నాయా..? అని ఆరా తీశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రతి ఒక్కరూ సమయానికి రావాలని, సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ ప్రదీప్, ఆర్డీవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

### తప్పులను సరిదిద్దుకోండి..

వికారాబాద్ : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు అందులో ఏవైనా తప్పులుంటే ప్రజాపాలన సేవాకేంద్రాల్లో సరిదిద్దుకోవచ్చునని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాలను మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కా ర్యాలయాల్లో.. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యం తో వివిధ పథకాలకు ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. కొన్ని దరఖాస్తుల్లో తప్పులు దొర్లిన నేపథ్యంలో వారు సరిచేసుకోవాలన్నారు. అలాగే గృహ జ్యోతి కింద విద్యుత్తు బిల్లు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పొందని పక్షంలో రేషన్‌కార్డు, విద్యుత్తు బిల్లు, కుటుంబసభ్యుల ఆధార్‌కార్డులు, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదును తీసుకుని ప్రజాపాలన సేవా కేంద్రాలకెళ్లి తమ దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవాలన్నారు.

# వేతనాలు చెల్లించాలి

## కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

రంగారెడ్డి, జూన్ 28 (నమస్తే తెలంగాణ): గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు మాట్లాడుతూ ఐదారు నెలలుగా జీతాలు రాక కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, హరితహారం తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ ప్రజలకు ఎటువంటి అంటువ్యాధులు, అనారోగ్య పరిస్థితులు రాకుండా సేవలందిస్తు న్న కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరించ డం సరైంది కాదన్నారు. ఎన్నికల మేని ఫెస్టోలో పొందుపర్చిన విధంగా కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అందించాలి డిమాండ్ చేశారు. 15 రోజుల్లో వేతనాలు చెల్లించని పక్షం లో సమ్మెకు దిగుతామని హెచ్చరించా రు. ధర్నా అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమో ని కృష్ణ, నర్సింహ, దేవేందర్, పెంట య్య, బాలరాజు, శేఖర్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం, నాయకులు జంగయ్య, సామేల్, కృష్ణ, యాదయ్య, రాజ్ కుమార్, సాల మ్మ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 108ను అందుబాటులో ఉంచాలి



108 వాహనాన్ని తనిఖీ చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల 108 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీకాంత్

పెద్దేముల్, జూన్ 28 : గ్రామీణ ప్రాంత ప్రజలకు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచి.. తక్షణమే ప్రథమ చికిత్స అందేలా చూడాలని సిబ్బందికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల 108 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిరోజూ ఎన్ని కేసులు చేస్తున్నారు..? నెలకు ఎన్ని కేసులు చేస్తున్నారు ? 108 వాహనంలోని అన్ని రకాల వైద్య పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా..? లేదా అని ఆరా తీశారు. ముఖ్యంగా జీపీఎస్ సిస్టమ్ హాట్‌స్పాట్ లోకేషన్‌లో 108 వాహనాన్ని ఉంచుతున్నారా? లేదా ? కేసు వచ్చిన 30 సెకన్లలో వాహనం అక్కడి నుంచి బయలుదేరుతుందా? లేదా.. రోగులు, క్షతగాత్రులను త్వరగా దవాఖానలకు చేర్చుతున్నారా? లేదా? అనే అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట 108 జిల్లా కో-ఆర్డినేటర్ మహేశ్, ఈఎంటీ సంజీవ్, పెద్దేముల్ 108 పైలట్ మహేశ్ ఉన్నారు.



పరిగి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి

- సింగరేణికి నేరుగా కేటాయించాలి : సీపీఎం నాయకులు

కులకచర్ల/పరిగి, జూన్ 28 : సింగరేణిలో బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బ్లాక్‌లను బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు వేలం పాటలో కట్టబెట్టేందుకు చేస్తున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పరిగి పట్టణంలోని బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనుల వేలాన్ని ఆపి.. నేరుగా సింగరేణికి కేటాయించాలన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమని అన్నారు. 61 బ్లాక్‌లను వేలం వేసి ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుస్స చంద్రయ్య, ప్రజాసంఘాల నాయకులు..ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, సీపీఎం నాయకులు హబీబ్, సత్యయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ట్యాంకర్ నీరే దిక్కు..

- మంచాల మండల పరిషత్ కార్యాలయంలో నీటి కష్టాలు
- ఇబ్బందుల్లో అధికారులు, సిబ్బంది

మంచాల మండల పరిషత్ కార్యాలయంలో నీటి కష్టాలు ఏర్పడ్డాయి. ఆఫీస్ పక్కన ఉన్న బోరు బావిలో నీళ్లు లేకపోవడం, మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రాకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతులు కడుక్కునేందుకు.. కాళ్లకృత్యాలు తీర్చుకునేందుకు నీరు లేకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోనే తాగునీటి ఎద్దడి ఉంటే.. ఇక గ్రామాల్లోని పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. -మంచాల, జూన్ 28

## రెస్టారెంట్లు, హోటళ్లలో నో క్వాలిటీ

- ఆహారప్రియులను ఆలోచనలో పడేస్తున్న 'ఫుడ్‌సేఫ్టీ'
- రెండున్నర నెలల వ్యవధిలో 129 చోట్ల తనిఖీలు
- 90 మంది వ్యాపారులకు షోకాజ్ నోటీసులు
- ఆహార నాణ్యతపై అనుమానాలుంటే..
- **040- 2111 1111** కి ఫిర్యాదు చేయండి
- జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి బాలాజీ

# ఆ ఆహారం తినకండి



సిటీబ్యూరో, జూన్ 28 (నమస్తే తెలంగాణ ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ.. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతోపాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గత ఏప్రిల్ నెల నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ కలిపి జీహెచ్‌ఎంసీ పరిధిలో 104, జీహెచ్‌ఎంసీ అవతల 25 కలిపి మొత్తం 129 చోట్ల తనిఖీలు చేపట్టారు. ఇందులో వంటగది అపరిశుభ్రత మొదలు, నాణ్యత లేని ఆహార పదార్థాలు, కుళ్లిపోయిన మాంసం, పురుగులు పట్టిన బిర్యానీ వం టివి అందిస్తున్న 90 మంది వ్యాపారస్తులకు జరిమానాలతోపాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పద్ధతి మార్చుకోవాలంటూ 30 మందికి హెచ్చరించి నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీలు బట్టి చూస్తే ఆహార ప్రియులు జర జాగ్రత్త వహించాల్సిందే.

### అత్యధికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లే..

మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు కల్తీరాయుళ్ల భరతం పట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే గడిచిన రెండున్నర నెలలుగా నిబంధనలకు అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఐస్ క్రీం పార్లర్లపై చర్యలు తీసుకున్నారు. దాదాపు 120కు పైగా వ్యాపార సంస్థలపై చర్య లు తీసుకుంటే అత్యధికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఆహార నాణ్యత ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040- 2111 1111లో సంప్రదించాలని ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి బాలాజీ సూచించారు. గతంలో కంటే పౌరుల్లో అవగాహన పెరిగిందని, రోజూ 100కు పైగా ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలు పాటించని వారి పట్ల మరింత కఠినంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### విస్తుపోయే నిజాలు

కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు దాకా నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్ ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత పాటించడం లేదు. ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మసాలాలు దట్టించి.. మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వచ్చిన సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. జీహెచ్‌ఎంసీకి నిత్యం 100కు వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి.

# పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తేవాలి

## వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



పోలీస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 28 : శిక్షణ కాలం ముగిసిన తర్వాత తెలంగాణ పోలీస్ డిపా ర్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వికారాబాద్‌లోని శిక్షణా కేంద్రంలో ట్రైనింగ్ తీసుకుంటున్న కానిస్టేబుళ్లతో మాట్లాడారు. వికారాబాద్ డీటీసీలో చాలా ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నదని.. ఇక్కడ శిక్షణ పొందడం అదృష్టమన్నారు. శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు క్రమశిక్షణ, ఏకగ్రతతో పూర్తి చేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. శిక్షణ కాలంలో చేస్తున్న యోగా, మెడిటేషన్, వ్యాయామాలను శిక్షణ అనంతరం కూడా కొనసాగిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మారుతున్న చట్టాలు, సైబర్, ఆర్థిక నేరాలపైనా అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం ఆయన తరగతి గదులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ రూమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామ్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఆర్ఐ నాగరాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# చిరస్మరణీయం..పీవీ నరసింహారావు సేవలు



పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కడ్తాల్, జూన్ 28 : దివంగత ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీటీసీల ఫోరం రంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు హయాంలో ప్రవేశపెట్టిన సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా రూపుదిద్దుకున్నదన్నారు. అలాగే తెలంగాణభవన్‌లో నిర్వహించిన పీవీ జయంతి వేడుకల్లో తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం పీవీ నరసింహారావు కుమార్తె ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సుజాత, సూపరింటెండెంట్ మహాలక్ష్మి, ఎంపీటీసీ నిర్మలాదేవి, కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు కాశీనాథ్‌రెడ్డి, సత్యంయాదవ్, రామచందర్‌నాయక్, కరుణాకర్‌గౌడ్, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## షాకిచ్చిన మందుబాబు..
# ఏకంగా బ్రీత్ అనలైజర్‌తోనే..

బొల్లారం, జూన్ 28 : ట్రాఫిక్ పోలీసులకు ఓ మందుబాబు షాకిచ్చాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తుండగా..ఆ పరికరంతో మందుబాబు పారిపోయాడు. గురువారం రాత్రి బోయిన్‌పల్లి పోలీసులు పుల్లారెడ్డి ఇంటి సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. ఇంతలోనే ఓ కారులోని డ్రైవర్‌ను పరీక్షిస్తుండగా, బ్రీత్ అన్‌లైజర్‌తో ఆ మందుబాబు ఉడాయించారు. చీకటిగా ఉండడం..కారు స్పీడ్‌గా వెళ్లడంతో అతను ఎవరనేది గుర్తించలేకపోయారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని.. మందుబాబు కోసం గాలిస్తున్నారు.